సాక్షి
విజయనగరం
శనివారం, 11, జనవరి, 2025



చేపల పిల్లలు అందించేది ఎప్పుడు?
మత్స్యకారులకు చేప పిల్లలను అందించడంలో కూటమి ప్రభుత్వం అలసత్వం వహిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. - IIలో



కార్మికుల నిరవధిక సమ్మె
చీపురుపల్లి మండలం కర్లాం వద్ద ఉన్న వెంకట్రామా పౌల్ట్రీ పరిశ్రమ కార్మికుల నిరవధిక సమ్మె కొనసాగుతోంది. - IIలో



పీడీఎస్ బియ్యం పట్టివేత
బలిజిపేట మండలం జనార్దనవలస గ్రామం వద్ద అక్రమంగా తరలిస్తున్న 2,300 కిలోల పీడీఎస్ బియ్యంను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. - IIలో

న్యూస్‌రీల్

వేణుగోపాలుని సేవలో జెడ్పీ చైర్మన్



అన్నంరాజుపేటలో శ్రీవారిని దర్శించుకుంటున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులు

శృంగవరపుకోట: జామి మండలం అన్నంరాజుపేటలోని వేణుగోపాలస్వామి ఆలయాన్ని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు తన భార్య పుష్పాంజలి, కుమార్తె సిరిసహస్రలతో కలిసి శుక్రవారం సందర్శించారు. వైకుంఠ ద్వారం గుండా శ్రీవారిని దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు శ్రీనివాసరావు దంపతులకు పూర్ణ కుంభంతో స్వాగతం పలకడంతోపాటు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట జామి జెడ్పీటీసీ సభ్యురాలు గొర్లె సరయు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొర్లె రవికుమార్, వైస్ ఎంపీపీ విజయలక్ష్మి, సర్పంచ్ సీహెచ్ సూర్యనారాయణ, శేషు, ఫణిబాబు, పాండ్రంకి సంజీవి, ఎస్.అప్పలరాజు, తదితరులు ఉన్నారు.

దేహదారుఢ్య పరీక్షలకు 408 మంది హాజరు



అభ్యర్థులకు సూచనలు చేస్తున్న అదనపు ఎస్పీ సౌమ్యలత

విజయనగరం క్రైమ్: స్టైపెండరీ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాల్లో భాగంగా జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం నిర్వహించిన దేహదారుఢ్య పరీక్షలకు 600 మందికి 408 మంది అభ్యర్థులు హాజరయ్యారు. నియామక ప్రక్రియను ఎస్పీ వకుల్‌జిందల్, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

శభాష్ లోహిత్



ఆర్ఐఎంఎస్‌లో సీటు సాధించిన లోహిత్‌ను అభినందిస్తున్న డైరెక్టర్ గణేష్

కొత్తవలస: విశాఖపట్నం జిల్లా సింహాచలం గ్రామానికి చెందిన విశ్వేశ్వరరావు, అశ్వినిల కుమారుడు గద్దాడ లోహిత్‌కుమార్ (ఏడో తరగతి) అరుదైన అవకాశాన్ని అందిపుచ్చుకున్నాడు. దేశంలోనే ప్రతిష్టాత్మకమైన రాష్ట్రీయ ఇండియన్ మిలటరీ కాలేజ్ (ఆర్ఐఎంసీ)లో మన రాష్ట్రానికి కేటాయించిన ఒక్క సీటును సొంతం చేసుకున్నాడు. విద్యార్థితో పాటు తల్లిదండ్రులను కొత్తవలసలోని ఏపీ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ గణేష్, ఉపాధ్యాయులు శుక్రవారం సత్కరించారు. తమ విద్యార్థి ప్రతిభను కొనియాడారు.

ఇంటర్మీడియట్‌లో నూతన విద్యావిధానం వద్దు



నిరసన తెలియజేస్తున్న నిరుద్యోగ భాషాధ్యాపకులు

విజయనగరం అర్బన్: ఇంటర్మీడియట్ బోర్డు కొత్తగా ప్రతిపాదిస్తున్న విధానం సెకండ్ లాంగ్వేజ్ పేపర్ రద్దు చేసేలా ఉందని, తక్షణమే ఈ విధానం రద్దుచేయాలని భాషాధ్యాపకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ సంస్కృతి కళాశాల ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. నూతన ప్రతిపాదనల మేరకు సెకండ్ లాంగ్వేజ్ పేపర్ స్థానంలో కోర్ సబ్జెక్ట్‌ను పెట్టడం వల్ల భాషాధ్యాపకులు ఉద్యోగాలు కోల్పోతారన్నారు. అనంతరం సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జనార్దననాయుడుకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థిసంఘ నాయకులు చోడిశెట్టి రామగోపాల్, అయికా భాస్కరరావు, రమణ, యామిని, తదితరులు పాల్గొన్నారు.

రామగిరి చుట్టూ భక్త సిరి





పుష్పాలంకరణలో సీతారామలక్ష్మణులు



మాజీ ఎంపీ బొత్స ఝాన్సీకి ఆశీర్వచనాలు అందజేస్తున్న అర్చకులు



నీలాచలం మెట్ల మార్గంలో గోపూజలో భక్తులు



గిరిప్రదక్షణలో పాల్గొన్న భక్తజన కోటి



- రామతీర్థంలోని రామగిరి ప్రదక్షిణకు పోటెత్తిన భక్తులు
- ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనమిచ్చిన రామస్వామివారు
- అంగరంగ వైభవంగా కోదండ రామస్వామి మెట్లోత్సవం
- భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి పూజలు

నెల్లిమర్ల రూరల్:

మంగళవాయిద్యాలు.. భక్తుల భజనలు.. కోలాట ప్రదర్శనలు, రామనామస్మరణతో రామతీర్థం పులకించింది. ఉత్తరద్వార దర్శనం, నీలాచలగిరి(రామగిరి) ప్రదక్షిణకు తరలివచ్చిన భక్తులతో భక్త తీర్థంగా మారింది. ముక్కోటి ఏకాదశి పర్వదినాన రామతీర్థంలోని రామగిరి ప్రదక్షిణకు భక్తులు శుక్రవారం తండోపతండాలుగా తరలివచ్చారు. కోదండ రామస్వామి కొలువై ఉన్న బోడికొండ చుట్టూ దాదాపు 7 కిలోమీటర్ల మేర కాలినడకన ప్రదక్షిణ చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగిన ఈ మహాఘట్టంలో విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల నుంచి సుమారు పదిహేను వేల మంది భక్తులు పాల్గొన్నట్టు ఆలయ వర్గాల అంచనా. పలువురు దాతలు మార్గంమధ్యలో భక్తులకు తాగునీరు, మజ్జిగ, పులిహోర ప్యాకెట్లను పంపిణీ చేశారు. గిరి ప్రదక్షిణ అనంతరం దేవాస్థానం ఆధ్వర్యంలో మహా అన్నదాన ప్రసాద వితరణ చేపట్టారు.



వైకుంఠ ద్వార దర్శనం చేసుకుంటున్న భక్తులు

● ఉత్తర మార్గం.. ముక్తి మార్గం..

ముక్కోటి ఏకాదశి పర్వదినాన ఉత్తర మార్గం నుంచి రామస్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. మూడు కోట్ల ఏకాదశితో సమానమైన పర్వదినాన స్వామివారికి ఆరాధన, తిరుప్పావై సేవాకాలం, మంగళాశాసనం, తీర్థగోష్ఠి కార్యక్రమాలను అర్చకులు జరిపారు. ఉదయం 5 గంటలకు ఉత్తర ద్వారం నుంచి స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు.

అనంతరం సీతారామస్వామి వారి ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లి తిరువీధి ఉత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు.

అంగరంగ వైభవంగా కోదండ రాముడి మెట్లోత్సవం

బోడికొండపై కొలువుదీరిన కోదండ రామస్వామివారి మెట్లోత్సవం కనుల పండువగా సాగింది. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన శ్రీవారి సేవా భక్తులు కొండపై కోదండ రామాలయానికి చేరుకునే మెట్లను శుభ్రం చేసి పసుపు, కుంకుమలతో బొట్లు పెట్టి అలంకరించి మెట్లోత్సవాన్ని జరిపించారు. అనంతరం గోపూజలను నిర్వహించి గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. సీఐ రామకృష్ణ, ఎస్ఐ గణేష్ ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తును నిర్వహించారు. మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ, రాష్ట్ర సాధుపరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసనంద సరస్వతి, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, ఎంపీపీ అంబళ్ల సుధారాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, మాన్సాస్ ట్రస్ట్ డీసీ ప్రసాద్, లోకం ప్రసాద్, వర్షిణి, సువ్వాడ రవిశేఖర్, మాజీ ఎంపీపీ సువ్వాడ వనజాక్షి, తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో దేవస్థాన ఈఓ వై శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పైడితల్లికి స్వర్ణపుష్పార్చన

విజయనగరం టౌన్:

ముక్కోటిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు జరిపారు. స్వర్ణపుష్పార్చన సేవ నిర్వహించారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్ శాస్త్రోక్తంగా పూజాధికాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి, తరించారు. కార్యక్రమాలను ఆలయ ఇన్‌చార్జి ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్ పర్యవేక్షించారు.



స్వర్ణపుష్పార్చన అలంకరణలో పైడితల్లి

ఆర్గానిక్ ఉత్పత్తులు ఆరోగ్యకరం

- కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: ఆర్గానిక్ ఉత్పత్తులు ఆరోగ్యకరమని కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఆర్గానిక్ ఉత్పత్తుల సంతను శుక్రవారం ఆయన ప్రారంభించారు. రైతులతో మాట్లాడారు. ఎన్ని ఎకరాల్లో సాగు చేస్తున్నారు, ఎంత పెట్టుబడి పెట్టారు, ఎంత లాభం వస్తోందని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున ఆర్గానిక్ పంటలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లాలో 12 వేల ఎకరాల్లో ఆర్గానిక్ పంటలు సాగవుతున్నట్టు వెల్లడించారు. సంతలో ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలు, ఆర్గానిక్ బెల్లం, పలు వెరైటీల బియ్యం, తిను బండారాలు, అరిసెలు, ఇతర మిటాయిలు, భోగి పిడకలు, అరటి, జామ పండ్లు, వేరుశనగ, నువ్వు ఉండలు తదితర ఉత్పత్తులను ప్రదర్శించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, జిల్లా వ్యవసాయ అధికారి వి. తారకరామారావు, ప్రకృతి వ్యవసాయ విభాగం మేనేజర్ ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.



ఆర్గానిక్ సంతలో ఏర్పాటు చేసిన పంట ఉత్పత్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

● ఆన్‌లైన్‌లో భోగిపిడకలు





కాలం మారింది. ఆహారం నుంచి ధరించే దుస్తుల వరకు అన్నీ ఆన్‌లైన్‌లో లభిస్తున్నాయి. భోగి పండగకు వినియోగించే భోగిపిడకల దండల విక్రయాలు సైతం ఆన్‌లైన్‌లో జోరుగా సాగుతున్నాయి. కౌ డంగ్ మాల అనే పేరుతో వ్యాపారం సాగుతోంది. ఒక్కో దండను సైజును బట్టి రూ.50 నుంచి రూ.500 వరకు విక్రయిస్తుండడం గమనార్హం. వాస్తవంగా చిన్నారులు భోగి మంటల్లో వేసే పిడకల దండలను ఆవుపేడతో అమ్మమ్మ, నాన్నమ్మలు తయారు చేసేవారు. ప్రస్తుతం ఆ సంస్కృతి కొన్నిచోట్ల కనిపించడం లేదు. పిల్లల ముచ్చట తీర్చేందుకు పెద్దలు ఆన్‌లైన్ మార్కెట్‌పై ఆధారపడుతున్నారు. గత నాలుగేళ్లగా అంతంతమాత్రంగా ఉండే వ్యాపారం ఈ ఏడాది ఊపందుకుందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. – రాజాం

ప్రాణం తీసిన.. రూ. 2వేలు అప్పుగొడవ

వీరఘట్టం: కేవలం రూ.2వేలు అప్పువివాదం ఓ వ్యక్తి ప్రాణాన్ని హరించింది. ఆ కుటుంబం ఇంటి పెద్దను కడతేర్చింది. పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం సంత నర్సిపురం గ్రామంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకున్న హత్యాఘటనకు సంబంధించి గ్రామస్తులు, మృతుని బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇటీవల గ్రామంలో పేకాట ఆడుతున్న సమయంలో బందలుప్పి కిరణ్‌కు చింత రామకృష్ణ(58) రూ.2వేలు బాకీపడ్డాడు. గురువారం రాత్రి 10 గంటల సమయంలో రామకృష్ణ తన ఇంటిలో భోజనం చేసి వీధిలోకి వెళ్లాడు. ఇంతలో అక్కడే ఉన్న కిరణ్ తనకు బాకీ ఉన్న డబ్బులు ఎప్పుడు ఇస్తావని రామకృష్ణను నిలదీశాడు. నీ డబ్బులు ఎవడికి కావాలి.. పావుగంటలో ఇచ్చేస్తానంటూ ఇంటికి వెళ్లి రూ.2 వేలు తీసుకుని కిరణ్ ఇంటికి వెళ్లి ఇచ్చేశాడు. ఈ క్రమంలో వీరిద్దరి మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేకుంది. కిరణ్‌కు డబ్బులు ఇచ్చేసిన అనంతరం రామకృష్ణ రాత్రి 11.30 గంటల సమయంలో ఇంటికి వెళ్లిపోతుండగా వెనుక నుంచి కిరణ్ దాడిచేశాడు. రోడ్డుపై తోసేసి గుండెలపై పిడిగుద్దులు గుద్ది, కాళ్లతో తన్నడంతో రామకృష్ణ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. ఈ ఘటనను చూసిన గ్రామస్తులు రామకృష్ణ భార్య ప్రమీలకు సమాచారం ఇచ్చారు. ఆమె వెంటనే చిన్నకుమార్తె అనితతో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. భర్తకు సపర్యలు చేశారు. మెలకువ రాకపోవడంతో రాత్రి 12.15 గంటల సమయంలో 108కు సమాచారం ఇచ్చారు. వాహన సిబ్బంది వచ్చి రామకృష్ణ మృతి చెందినట్టు నిర్ధారించారు. ఈ విషయం గ్రామస్తులకు తెలియడంతో ఒక్కసారి ఉలిక్కిపడ్డారు. విషయం తెలిసిన వెంటనే రాత్రి ఒంటి గంట సమయంలో వీరఘట్టం ఎస్ఐ జి.కళాధర్ గ్రామానికి వచ్చి పరిస్థితిని పరిశీలించారు. మృతుని భార్య ప్రమీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు. హత్యకు పాల్పడిన కిరణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్యతో పాటు పవిత్ర, లావణ్య అనే పెళ్లైన కుమార్తెలు ఉన్నారు. అందరితో ఎంతో మంచిగా ఉన్న రామకృష్ణ హత్యకు గురికావడంతో గ్రామంలో విషాదం అలముకుంది.



రామకృష్ణ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



హత్య కారణాలను సేకరిస్తున్న సీఐ చంద్రమౌళి, ఎస్ఐ కళాధర్

సంక్రాంతి వంటకాలు రెడీ









సంక్రాంతి.. పల్లె ప్రజలకు పెద్ద పండగ. ప్రతి ఇంటా సందడే. కొత్త అల్లుళ్లు.. పిల్లలు, పెద్దలకు వడ్డించేందుకు ప్రతి ఇంటా పిండివంటకాలు తయారవుతున్నాయి. సంప్రదాయ వంటకాల తయారీలో మహిళలు బిజీ అయ్యారు. రామభద్రపురం, వన్నలిలో పిండివంటకాలు చేస్తున్న మహిళలను చిత్రాల్లో చూడొచ్చు. – రామభద్రపురం/రేగిడి

క్లుప్తంగా

ఐటీడీఏ డీడీగా కృష్ణవేణి



డీడీకి శుభాకాంక్షలు తెలుపుతున్న గిరిజన సంఘం నాయకులు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయం డీడీగా కృష్ణవేణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు గిరిజన సంఘ నాయకులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. పల్ల సురేష్ చంద్రశేఖర, దుక్క సీతారాం, త్రినాధ్‌వెంకటరమణ, గౌతమ్ తదితరులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

ఎన్‌సీసీ ఉపాధ్యాయుడి సస్పెన్షన్

సాక్షి ఎఫెక్ట్

పార్వతీపురంటౌన్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న జి నరసింహదేవ్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి తిరుపతినాయుడు సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో పలు ఆరోపణలపై అగస్టులో "సాక్షి" ప్రచురించిన యూనిఫాం పేరుతో డబ్బుల వసూళ్లు కథనంపై జిల్లా విద్యాశాఖ అధికారులు, ఎన్‌సీసీ అధికారులు దర్యాప్తు చేపట్టారు. 2024వ సంవత్సరంలో బ్రాంచి హైస్కూల్‌లో 100 మంది ఎన్‌సీసీ విద్యార్థులకు వచ్చిన యూనిఫాం డబ్బులు వసూలు చేసిన వార్తకు స్పందించి దర్యాప్తు నిర్వహించి పార్వతీపురం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ ఉపాధ్యాయుడు (ఎఎస్‌ఏ) నరసింహదేవుడును సస్పెండ్ చేస్తూ డీఈఓ తిరుపతి నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు.

2300కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యంతో సీఎస్‌డీటీ రమేష్‌బాబు, అధికారులు

బలిజిపేట: మండలంలోని జనార్దనవలస గ్రామం వద్ద అక్రమంగా తరలుతున్న 2,300కిలోల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు సీఎస్‌డీటీ రమేష్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం విజయనగరం జిల్లా వంగర మండలం, లక్ష్మింపేట గ్రామంలో అక్రమంగా కొనుగోలుచేసి వాటిని ఒడిశా రాష్ట్రంలోని అలమండ గ్రామానికి తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు పట్టుకున్నారు. ఆ బియ్యం తరలిస్తున్న బొలెరో వాహనాన్ని పట్టుకుని, ఓనర్ ఆవు చిన్నంనాయుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాకుళం విజిలెన్స్ ఎస్సై రామ్మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

గడ్డి మందుతాగి వ్యక్తి ఆత్మహత్య

సంతకవిటి: మండలంలోని పుల్లిట గ్రామానికి చెందిన కొలు స్వామినాయుడు(25) గడ్డి మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్వామినాయుడు తీవ్రమైన కడుపు నొప్పి భరించలేక గత నెల 25న గడ్డిమందు తాగడంతో శ్రీకాకుళం రిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు ఏఎస్సై వాసుదేవరావు తెలిపారు. మృతుడి భార్య అనూష శుక్రవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు వెల్లడించారు.

చేపల పిల్లలు అందించేది ఎప్పుడు..!

- జూన్, జూలై నెలల్లో ఫింగర్ రింగ్స్ అందించాలి
- ఇంతవరకు ఖరారు కాని టెండర్ ప్రక్రియ



చిరు చేపపిల్లలు

విజయనగరం ఫోర్ట్: మత్స్యకారులకు చేప పిల్లలను అందించడంలో కూటమి ప్రభుత్వం అలసత్వం వహిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చేపపిల్లల పెంపకం చేపట్టే గడువు దాటినప్పటికీ ఇంతవరకు మత్స్యకారులకు చేప పిల్లలను అందించలేదు. చేపపిల్లలు పెంచే సమయం జూన్, జూలై నెలల్లో అయితే చెరువుల్లో సమృద్ధిగా నీరు ఉంటుంది చేప పిల్లలు పెరగడానికి అవకాశం ఉంటుంది. ప్రస్తుతం చెరువుల్లో నీరు తగ్గుతుంది. దీని వల్ల చేప పిల్లల ఎదుగుదల అంతంతమాత్రంగానే ఉంటుంది. అధికారంలోకి వస్తే మత్స్యకారులకు మేలు చేస్తామని గొప్పలు చెప్పిన కూటమి నేతలు గద్దె నెక్కిన తర్వాత వారి సంక్షేమాన్ని పక్కన పెట్టేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సముద్రంలో చేపల వేట సాగించే మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో ఇచ్చే వేట నిషేధ భృతిని కూడా మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి సంబంధించి ఇంతవరకు ఇవ్వలేదు.

చేప పిల్లలు ఉచితంగా అందించాల్సి ఉంది

మత్స్యకారులకు ఫింగర్ రింగ్ సైజు చేప పిల్లలను ఉచితంగా అందించాల్సి ఉంది. ఫింగర్ రింగ్ చేప పిల్లలు మత్స్యకార సొసైటీలకు సరఫరా చేయడానికి టెండర్లు పిలిచి ఖరారు చేస్తారు. టెండర్ దక్కించుకున్న వారు మత్స్యకారులకు ఫింగర్ రింగ్ చేప పిల్లలను సరఫరా చేస్తారు. జిల్లాలో 57 వరకు మత్స్యకార సొసైటీలు ఉన్నాయి. ఈ సొసైటీల పరిధిలో ఉన్న చెరువుల్లో చేప పిల్లలను వేస్తారు.

పూర్తి కాని టెండర్ పక్రియ

ఫింగర్ రింగ్స్ చేప పిల్లలను సొసైటీలకు అందించడం కోసం టెండర్లు పిలిచి వాటిని ఖరారు చేస్తారు. టెండర్ల పక్రియ ఇంకా పూర్తి కాలేదు.

టెండర్లు పిలిచాం

మత్స్యకారులకు ఫింగర్ రింగ్ చేప పిల్లలు పంపిణీ చేయడానికి టెండర్లు పిలిచాం. టెండర్లు త్వరలోనే జేసీ ఆధ్వర్యంలో ఖరారు చేస్తాం. టెండరు ఖరారైన వెంటనే చేప పిల్లలను సరఫరా చేస్తాం.

నేతల నిర్మలకుమారి, ఉప సంచాలకురాలు, మత్స్యశాఖ

కొనసాగుతున్న కార్మికుల నిరవధిక సమ్మె

- 14వ రోజుకు పౌల్ట్రీ పరిశ్రమ కార్మికుల నిరసన
- పరిశ్రమ ఎదుటే సమ్మె, వంటావార్పు



వెంకట్రామా పౌల్ట్రీ పరిశ్రమ ఎదుట కార్మికుల వంటావార్పు

చీపురుపల్లి: మండలంలోని కర్లాం వద్ద ఉన్న వెంకట్రామా పౌల్ట్రీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల నిరవధిక సమ్మె కొనసాగుతోంది. గత ఏడాది పరిశ్రమ యాజమాన్యం, కార్మికసంఘం ఆధ్వర్యంలో కుదిరిన ఒప్పందం ప్రకారం వేతన సవరణ చేయాలని కోరుతూ పౌల్ట్రీ పరిశ్రమ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులు నిరవధిక సమ్మె చేపడుతున్న సంగతి తెలిసిందే. అయితే 2024 డిసెంబర్ 27న కార్మికులు ప్రారంభించిన నిరవధిక సమ్మె 14 రోజులుగా కొనసాగుతోంది. వేతన ఒప్పందం అమలు చేయాలని కోరుతూ కార్మికులు ఆ పరిశ్రమ ప్రధాన గేటు ఎదుట నిరవధిక సమ్మె చేపడుతున్నారు. పరిశ్రమలోకి విధుల్లోకి వెళ్లకుండా కార్మికులు దీక్షా శిబిరం వద్ద వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహిస్తూ తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమ వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. 2024 మే 31 నాటికి వేతన ఒప్పందం అమలు సమయం ముగిసిపోయినప్పటికీ 2024 డిసెంబర్ 27 వరకు పరిశ్రమ యాజమాన్యం అమలు చేయకపోవడంతో కార్మికులు నిరవధిక సమ్మెలోకి వెళ్లారు. అయితే ఒప్పందం ప్రకారం రూ.2,300 వేతన సవరణ చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తుండగా కేవలం రూ.300 మాత్రమే ఇవ్వగలమని పరిశ్రమ యాజమాన్యం స్పష్టం చేస్తోంది. దీనిపై కార్మికశాఖ అధికారుల వద్ద పలుమార్లు చర్చలు జరిగినప్పటికీ ఎలాంటి ప్రయోజనం కనిపించలేదు. దీంతో జనవరి 5న ఆర్‌డీఓ, డీఎస్పీ వద్ద కూడా మరోసారి యాజమాన్యం, కార్మికుల మధ్య చర్చలు జరిగినా విఫలమయ్యాయి. దీంతో కార్మికులు నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నారు. అంతేకాకుండా రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు వద్దకు కూడా కార్మికులు వెళ్లి తమ సమస్య వినిపించారు. దీంతో జిల్లా కార్మికశాఖ అధికారుల సమక్షంలో మరోసారి చర్చలు జరిపేందుకు ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

ఈనెల 20నుంచి కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపుపై అవగాహన

- కలెక్టర్ అంబేడ్కర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఆర్.అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 2 వరకు జిల్లాలో 14 రోజుల పాటు కుష్ఠు వ్యాధి గుర్తింపుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. శుక్రవారం తన చాంబర్‌లో వైద్యాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శరీరంపై స్పర్శలేని మచ్చలు, చర్మంపై రాగిరంగు మచ్చలు, లావుగా మారిన నొప్పితో కూడిన నరాలు, కాళ్లలేదా చేతులు, పాదాలు నరాల్లో తిమ్మిరుగా అనిపించినా తదితర లక్షణాలు ఉన్న వారు పరీక్షలు చేయించుకోవాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ జీవన రాణి, డీఎల్ఓ డాక్టర్ రాణి తదితరులు పాల్గొన్నారు.

కడప జిల్లాలో 70 మందికి కృత్రిమ అవయవాల పంపిణీ



కృత్రిమ అవయవాల పంపిణీ శిబిరంలో మాట్లాడుతున్న కడప నెహ్రూయువకేంద్రం యూత్ అధికారి మనికంఠ

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గ్రామంలో గల గురుదేవా చారిటబుల్ ట్రస్టు సహకారంతో చేతన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కడప జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో 70 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందజేసినట్లు ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కడప జిల్లా నెహ్రూ యువకేంద్రం యూత్ అధికారి కె.మణికంఠ మాట్లాడుతూ గురుదేవా సేవలు ఎల్లలు దాటాయాని ఆ ట్రస్టు అందించిన సహకారంతో ఎంతో మంది దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. ట్రస్టు చైర్మన్ జగదీష్‌బాబు దివ్యాంగుల పాలిట ఆపద్బాంధవుడిలా నిలిచారని ప్రశంసించారు. కార్యక్రమంలో చేతన్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వ్యాపారుల నుంచి నగదు లాక్కొని పరారీ

- రూ.19,76,300 నగదు పట్టుకుపోయిన దుండగులు
- కేసు నమోదు చేసిన పోలీసులు

దుంబ్రిగుడ (అల్లూరి సీతారామరాజు జిల్లా): అరకు వారపు సంతకు కొనుగోళ్ల నిమిత్తం ఇద్దరు వ్యాపారులు తీసుకువచ్చిన నగదును గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు లాక్కొని పరారయ్యారు. శుక్రవారం ఉదయం విజయనగరం జిల్లా ఎస్‌కోట మండలానికి చెందిన వ్యాపారులు కాపుగంటి రామచంద్రరావు, తిరుమలరావు రూ.19,76,300 నగదుతో శుక్రవారం ఉదయం 6 గంటల సమయంలో వారి గొడౌన్ వద్ద వేచి ఉన్నారు. గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు వారి వద్దకు వచ్చి నగదు ఉన్న రెండు బ్యాగ్‌లను లాక్కొని పరారయ్యారు. తమకు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ కె.పాపినాయుడు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారిని పట్టుకునేందుకు మూడు బృందాలు రంగంలోకి దిగాయన్నారు.

జేసీబీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



జేసీబీ ఢీకొట్టిన సంఘటనలో దెబ్బతిన్న బైక్

గజపతినగరం: మండలంలోని బంగారమ్మ పేట గ్రామానికి చెందిన సుంకరి అప్పలనాయుడు(40) అనే వ్యక్తిని జేసీబీ ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. శుక్రవారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. బంగారమ్మపేట గ్రామానికి చెందిన సుంకరి అప్పలనాయుడు తన స్వగ్రామంనుంచి మధుపాడ వైపు ద్విచక్రవాహనంపై వస్తుండగా మార్గమధ్యంలో ఎదురుగా వస్తున్న జేసీబీ ఆయనను ఢీకొట్టింది. దీంతో అప్పలనాయుడు కుడి కాలు విరిగినట్లు పోలీసులు తెలిపారు. క్షతగాత్రుడిని వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. అప్పలనాయుడు బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్సై కె.లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాక్సింగ్ సెంటర్‌కు ఎల్ఈడీ టీవీ వితరణ



బాక్సింగ్ సెంటర్‌కు ఎల్ఈడీ టీవీని అందజేస్తున్న విశ్వనాథం కుటుంబసభ్యులు

విజయనగరం: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ క్రీడామైదానంలో నిర్వహిస్తున్న బాక్సింగ్ సెంటర్‌కు విశాఖకు చెందిన క్రీడా ప్రోత్సాహకులు ఎల్ఈడీ టీవీని అందజేశారు. ఈ మేరకు శుక్రవారం రాజీవ్ క్రీడామైదానంలో జరిగిన కార్యక్రమంలో విశాఖ ఐటీఐ ప్రాంతానికి చెందిన కీర్తిశేషులు ఆర్‌కే.విశ్వనాథం జ్ఞాపకార్థం ఆయన సతీమణి మల్లి, కుమారులు గిరీష్‌బాబు, కార్తీక్ కుట్టాలు రూ.45వేలు విలువ చేసే 45 ఇంచీల ఎల్ఈడీ టీవీని బాక్సింగ్ కోచ్ ఈశ్వరరావు, క్రీడాకారులు సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో పలువురు బాక్సింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

సినీగేయ రచయిత రామ్‌పైడి శెట్టి మృతి



పైడిశెట్టి రామ్ మృతదేహం



గాయని చిత్రతో రామ్

రామభద్రపురం: సినీగేయ రచయిత, సంగీత సహాయ దర్శకుడు రామ్ పైడిశెట్టి(40) హైదరాబాద్‌లో శుక్రవారం మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. అనుమానాస్పద మృతిగా భావిస్తున్నారు. ఆయనది రామభద్రపురం మండలం పరిధిలోని బూశాయవలస గ్రామం. 20 ఏళ్ల క్రితం హైదరాబాద్ వెళ్లిపోయి నివాసం ఉంటూ సినీగేయ రచయితగా, సంగీత సహాయ దర్శకుడిగా చేస్తూ సినీరంగంలో స్థిరపడ్డారు. తల్లిదండ్రులు కరోనా సమయంలో మృతిచెందగా తమ్ముడు విశాఖపట్నం వలస వెళ్లిపోయాడు. రామ్ పైడిశెట్టికి ఇంకా వివాహం కాలేదు. ప్రతి ఏడాది సంక్రాంతికి స్వగ్రామానికి వస్తున్న రామ్ ఈ ఏడాది సంక్రాంతి పండగకు వచ్చే సమయంలో మృతిచెందాడు. మరణ వార్త సమాచారంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. శనివారం హైదరాబాద్ నుంచి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు జరపనున్నట్లు స్థానికులు తెలిపారు.

రెవెన్యూ సదస్సుల దరఖాస్తులను ఆడిట్ చేయాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్

విజయనగరం అర్బన్: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి ఆడిట్ చేసి సానుకూలంగా పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఈ మేరకు కలెక్టర్ తన చాంబర్‌లో నియోజకవర్గం ఇన్‌చార్జ్‌లైన డిప్యూటీ కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్లు పరిష్కరించిన ప్రతి దరఖాస్తును ఆడిట్ చేయాలని చెప్పారు. సదస్సుల్లో మొత్తం 6,846 దరఖాస్తులు రాగా ఇప్పటికే 2,776 దరఖాస్తులను తహసీల్దార్లు పరిష్కరించారని తెలిపారు. ఈ దరఖాస్తులను పరిష్కరించితే జిల్లాలో రెవెన్యూ పరమైన సమస్యలన్నీ దాదాపు పరిష్కరించడమవుతుందన్నారు. కోర్టులనుంచి ప్రత్యేకంగా ఏమైనా ఆదేశాలు ఉన్నవి మినహా వివాదాలు ఉన్న భూములను కూడా పరిష్కరించవచ్చునని సూచించారు. రీ సర్వేలో వచ్చిన దరఖాస్తులను కూడా రెవెన్యూ సదస్సుల్లో కవర్ అయిందీ లేనిది పరిశీలించాలని సూచించారు. సమాధానాలు అస్పష్టంగా ఉండకూడదన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్డీఓలు కేఆర్‌ఆర్‌ఈసీ ఎస్డీసీ మురళి, ఇన్‌చార్జ్ డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹124	₹218	₹228

గంజాయి పీలుస్తున్న ఆరుగురి అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్

విజయనగరం క్రైమ్: గంజాయి పీలుస్తున్న ఆరుగురు నిందితులను వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక గూడ్స్‌షెడ్ జంక్షన్ వద్ద కొందరు గంజాయి పీలుస్తున్నట్లు వచ్చిన సమాచారం ఆధారంగా అక్కడకు వెళ్లి అప్పటికే గంజాయి పీలుస్తున్న వ్యక్తిని పట్టుకుని విచారణ చేయగా ఆరుగురు నిందితులు పట్టుబడ్డారు. వారంతా పట్టణంలోని కేఎల్.పురం, బాబామెట్ట, దాసన్నపేటకు చెందిన వారు. వారిలో కొందరు ఇంజనీరింగ్ విద్యార్థులు కూడా ఉన్నారు. అరెస్ట్ అయిన వారిలో కేఎల్.పురానికి చెందిన పుణ్యపు సాయి ప్రకాశ్, ప్రసాదపు కేదారినాథ్, బాబామెట్టకు చెందిన కె.వెంకటరమణ, కర్నూలుకు చెందిన బి.సాయి చరణ్ కుమార్, వెస్ట్ గోదావరికి చెందిన మింది శివశ్యామ్, దాసన్నపేటకు చెందిన పెంకి యశ్వంత్ శివసాయి, ఉడాకాలనీకి చెందిన పువ్వల లోకేష్‌లు ఉన్నారని సీఐ తెలిపారు. వారందరినీ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని వారు గంజాయి పీలుస్తున్న పరికరాలను, బాటిల్స్, కొంతమొత్తంలో గంజాయి మెటీరియల్‌ను సీజ్‌చేసి వారిని పోలీస్‌స్టేషన్‌కి తరలించి వారిపైన కేసులు నమోదుచేశామని చెప్పారు.

పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికే 'వెల్ఫేర్ డే'



పోలీస్ సిబ్బంది సమస్యలు వింటున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికే పోలీస్ వెల్ఫేర్‌డేను నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది సమస్యలు తెలుసుకున్నారు. వారి నుంచి విజ్ఞాపనలు స్వీకరించారు. సిబ్బంది విజ్ఞాపనలు పరిశీలించిన ఎస్పీ, వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. పోలీసు సిబ్బంది తెలిపిన వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలను ఎస్పీ స్వయంగా నోట్ చేసుకుని, వాటి పూర్వాపరాలు పరిశీలించి, పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు చేపడతానని తెలిపారు.

ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం

- జనవరి 21 నుంచి దరఖాస్తులకు ఆహ్వానం
- జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయి కృష్ణ చైతన్య



జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె సాయి కృష్ణ చైతన్య

పార్వతీపురంటౌన్: ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ ద్వారా రాబోయే 5 సంవత్సరాల్లో దేశంలోని టాప్ 500 కంపెనీల్లో కోటి మంది యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్ ప్రారంభమైందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశవ్యాప్తంగా యువత ఉపాధి అవకాశాలను ప్రోత్సహించేందుకు కేంద్రప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుందని తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యపరమైన శిక్షణతో కూడిన విద్యను 12 నెలలు పారిశ్రామిక అనుభవం అందించాలని సంకల్పించిందని తెలిపారు. 20 కంటే ఎక్కువ రంగాలలో యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఇంటర్న్‌షిప్ చేయాలనుకునే వారికి దేశవ్యాప్తంగా అవకాశాలు ఉంటాయన్నారు.

విద్యార్హతల విషయానికొస్తే..

ఇంటర్న్‌షిప్ స్కీమ్‌కు అర్హత సాధించడానికి, దరఖాస్తుదారులు తమ ఉన్నత పాఠశాల విద్యను పూర్తి చేసి ఉండాలని తెలిపారు. ఐటీఐ నుంచి సర్టిఫికెట్, పాలిటెక్నిక్ ఇనిస్టిట్యూట్ నుంచి డిప్లమో లేదా బీఏ, బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీఫామ్ వంటి డిగ్రీని కలిగి ఉండాలని సూచించారు. ఆన్‌లైన్ లేదా దూరవిద్య ప్రోగ్రామ్‌లో నమోదు చేసుకున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. భారత ప్రభుత్వం ద్వారా ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన కింద చేరే ప్రతి ఒక్కరికీ బీమా కవరేజీ అందిస్తుందన్నారు.

నమోదు చేసుకోవాలిలా..

అర్హత, అభ్యర్థులు ఈ క్రింది లింక్‌లో నమోదు చేసుకోవాలన్నారు. హెచ్‌టీటీపీఎస్://ప్రిమినిస్ట్రిషిప్.ఎంసీఏ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఈ ఇంటర్న్‌షిప్ కోసం ఆధార్, బయోడేటాతో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని తెలిపారు. ఎంపికైన వారికి 12 నెలలపాటు రూ.5 వేలు స్టైపెండ్ అందిస్తారన్నారు. ఏకకాల గ్రాంటు కింద రూ.6 వేలు కూడా ఇస్తారని, ఇంటర్న్‌షిప్ జనవరి 10వ తేదీన ప్రారంభమైందని. జనవరి 21వ తేదీ ఆఖరు తేదీ అని తెలిపారు. 21-24 ఏళ్ల మధ్య వయసున్న అభ్యర్థులే ఈ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు అర్హులన్నారు. మరిన్ని వివరాలు మరిన్ని వివరాల కోసం ఫోన్ 9676965949 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.